
నవ్య వీక్లి - పసుపులేటి లక్ష్మినారాయణ స్మృతిసాహితి కథల పోటీలో

## రూ. 2,000 ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

సాయంత్రం ఐదు గంటలైంది.
గదిలో ఫ్యానుగాలి వేడిమి ఇంకా తగ్గలేదు.
టీవీలో సినిమా గొడవ మరింత వేడి పుంజుకొంది.
కిచెన్‌లో ఏదో పన్జేసుకొంటూ వుంది అమ్మ.
బైట కాంపౌండ్ వాల్ గేటు చప్పుడు విన్పించి కర్టన్ తొలగించి చూశాను.
వాడిపోయిన మొగంతో లోపలికి వస్తూ నాన్న.
ఇంట్లో కెళ్ళి చల్లని నీళ్ళతో ఎదురొచ్చాను.
చెంబెడు నీళ్లు తాగి, ఫ్యాన్ స్పీడు పెంచి కుర్చీలో వాలాడు ఆయన.

# నాన్న కావాలి!

సన్నపురెడ్డి శ్రావణి



శరీరమంతా అలసటతో, మొహంనిండా బడలికతో, మాట కూడా కలపకుండా కళ్లు మూసుకొని కుర్చీలో వాలివున్న ఆయన్ను చూస్తోంటే నాకు జాలిలాంటి భావమేదో మనస్సులో కదలాడింది.

"చిన్నాన్న అబ్బ జేజి బాగుండారా నాన్నా?" అడిగాను.

మెల్లిగా కళ్లు తెరిచి "ఏమి చిన్నాన్నోలేమ్మా!" అన్నాడు నిర్లిప్తంగా. "దిక్కుమాలిన కొంప. పనికిమాలిన పల్లె"

"ఎప్పుడూ వుండేదే గదా! కొత్తగా చెప్పేదేముంది?" అన్నాను.

ఆయన్నించి సమాధానం లేదు.

నాన్న ముఖంలో వేడితాపం వల్ల కలిగిన బడలిక కంటే మరేదో ఆవేదన జబజబలాడుతూ వుంది.

పల్లెకు వెళ్లివచ్చిన ప్రతిసారీ నాన్న పరిస్థితి ఇంతే. పదిరోజుల దాకా అదోలా వుంటాడు. ఏదో

పోగొట్టుకొన్నట్లుగా ఆలోచిస్తూ వుంటాడు. ముఖం మీద కదలాడే పల్లె తాలూకు వేదనను కడుక్కొనేందుకు ప్రయత్నించడు.

ఆయన పట్ల పల్లె ఎందుకంత క్రూరంగా వుంటుందో నాకర్థంగాదు. ప్రతిసారీ పదిరోజుల పాటు మా నాన్నను మాకు కాకుండా చేస్తోన్న పల్లె పట్ల నాక్కొంత కోపంగా వుంది. మా నాన్ననే అది ఎందుకు వెంటాడుతోందో, ఎందుకు బాధపెడుతోందో, మమ్మల్నందర్నీ వదలిపెట్టి ఆయన్నే ఎందుకు టార్గెట్ చేసుకొంటోందో తెలీటం లేదు.

నాన్నను చూస్తోంటే నాకు బాధగా ఉంది.

అప్పుడే అమ్మ వంటింట్లోంచి వచ్చింది.


నాన్న కేసి ఓసారి చూసి చూపుల్ని అటు ఇటు తిప్పింది. ఆ మూలకీ, యీ మూలకీ, టేబుల్‌పైకి మళ్లించింది.

నాకర్థమైంది.

పల్లెనుంచి వచ్చినపుడంతా చేసంచినొకదాన్ని పట్టుకొస్తాడు నాన్న. వేరుసెనక్కాయలో, పెసరకాయలో, కందికాయలో, అలసందలు అనుములాంటి పప్పు ధాన్యాలో... ఏదొకటి... వూరకే రాడు.

ఇప్పుడాయన ఉత్తచేతుల్తో వచ్చిన విషయం ఆమె పసిగట్టింది. మరోసారి నాన్నకేసి చూసి బైటకు నడిచింది.

అమ్మలో ఒక సుగుణం ఉంది. ఏ విషయాన్నయినా సాగదీయదు. గొణుగుళ్లతో మానసికంగా హింసించదు. అడపాదడపా నాన్న తన జీతం డబ్బు పల్లెకు పంపిస్తున్నాడని తెలిసినా దాన్నొక సమస్యగా చేసి ఇబ్బంది పెట్టదు. తనకు ఇష్టం లేని



పనిచేస్తే మౌనంగా వుండిపోతుంది. వంట చేస్తుంది. అన్నం పెడుతుందిగాని ఎదుటివారితో మాట్లాడదు. ఆమె మాట్లాడకుంటే మాకు ఎదురయ్యే ఇబ్బందులు అన్నీ యిన్నీ కావు. ఒకొక్కసారి మేము ఏం తప్పు చేశామో తెలియక గడచిన రెండ్రోజులుగా మా మూమెంట్సన్నీ మరోసారి తిరగేసి చూసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. మా తప్పుల్ని మేము సరిదిద్దుకొన్న తర్వాతే ఆమె మాతో మాట్లాడుతుంది.

పల్లెగాయం మానేంతదాకా నాన్న కొంత విసుగును ప్రదర్శిస్తుంటాడు. అలాంటపుడు మేము కూడా కొంత జాగ్రత్తగానే వుంటాము.

వీధిలో ఉన్న శ్రీనాథ్‌ను వెంటబెట్టుకొచ్చింది అమ్మ.

వాడు ఇంట్లోకి రాగానే టేబుల్‌మీది నాన్న సెల్‌ఫోన్ తీసుకొని నొక్కసాగాడు. అదొక ఉత్సాహక్రీడ వాడికి.

టీ.వి. ముందు కూచున్నాడు గాని దానికేసి చూట్టంలేదు నాన్న. కళ్లు మూసుకొని తల వెనక్కి వాల్చి వున్నాడు. బహుశా పల్లెకు సంబంధించిన వేదనల్ని తనలోకి ఇంకించుకొనేందుకూ, జీర్ణించుకొనేందుకూ ప్రయత్నిస్తున్నాడేమో!

ఎవరితోనైనా పంచుకొంటే బాధ తాలూకు తీవ్రత కొంతయినా తగ్గుతుందిగాని, ఇంట్లో ఎవరికి పంచగలడు? అది పూర్తిగా ఆయన స్వంత వ్యవహారంగా భావించే అమ్మకు పంచగలడా? తన దృష్టిలో ఇంకా చిన్న పిల్లలుగా వున్న మాకు పంచగలడా? అక్క వుండుంటే ఆమెకు చెప్పుకుని బరువు దించుకొని వుండేవాడేమో! ఆమె అత్తగారింట్లో వుంది.

కొంతసేపయింతర్వాత లేచి స్నానం చేసి డ్రస్ మార్చుకొని బజారుకెళ్లాడు నాన్న.

నాక్కొంత వూరట కలిగింది. 'అక్కడయినా తన స్నేహితుల వద్ద సేదదీరి వస్తాడుగదా' అని

నాకు అక్కకు, తమ్ముడికి ఒక మధుర జ్ఞాపకమయిన పల్లె ఎందుకో మరి నాన్ననే పట్టి పీడిస్తోంది.

నాకు ఆరేడేళ్ల వయస్సులో అక్కతో కలిసి పల్లెకు వెళ్లినపుడు మా వయసు పిల్లలతోటి తూనీగలమై ఎగురుతూ వుంటే వీధులన్నీ ఎంతగా తలెత్తి చూసేవి. సంక్రాంతి ఉదయాలు చలిమంటలై మమ్మల్ని పొదువుకొనేవి. చిన్నాన్న చేతుల్లో చిరుచేపలమై బావినీళ్లల్లో యీదేందుకై చేసిన ప్రయత్నాలు ఇప్పటికీ కళ్లముందు కదలాడుతున్నాయి. మునగబెండ్లు వీపుకు కట్టుకొని ఈత నేర్చుకొన్న స్మృతులూ, రాత్రిళ్లు చేలవద్ద పచ్చి వేరుసెనక్కాయలు కాల్చుకొని కడుపునిండా తిని ఇంటికి రాగానే కడుపు నెప్పి రాకుండా ఉప్పు కలిపిన చిక్కటి మజ్జిగ తాగించిన జేజి ఆప్యాయతలూ, వీధి వీధి సందు సందూ దాగుడు మూతలూ, 'సన్నబియ్యం సన్నాకుప్పలు' ఆటలూ, ఎద్దుల కొట్టంలో బుస్‌మనే ఎద్దుల్ని చూసి ఉలికిపడిన వైనాలూ, పల్లె పదాలతో పలకరించే జేజీ, మంత్రతంత్రాల కథలతో ముచ్చట్లాడే అబ్బా... పల్లె ఒక మధురమైన జ్ఞాపకంగానే మిగిలింది మాకు.

మరో ఐదేళ్ల తర్వాత వేసవి సెలవుల్లో వెళ్లినపుడు కూడా పల్లె మమ్మల్నేమీ ఇబ్బంది పెట్టలేదు. ఎద్దుల్లేవు. బండ్లు లేవు. ట్రాక్టర్ల బాడుగ సేద్యాలు. పత్తి, పొద్దు తిరుగుడు లాంటి పైర్లు తప్ప గింజలు, పప్పుధాన్యాల పైర్లు తగ్గాయి. వీధుల్నిండా ఆడుకొనే పిల్లలు కూడా కన్పించలేదు. అందరూ టీవిల వద్ద ఉన్నారు. మాక్కూడా ఆటల్ని గురించి ఆలోచించేంత సమయంలేదు. చిన్నాన్న, చిన్నమ్మ, అబ్బ, జేజిల ఆప్యాయతల్లో ఏమాత్రం తరుగుదల కన్పించలేదు. కోళ్ని కోయటాలూ, పిండివంటలు చేయటాలూ, మమ్మల్ని గురించీ, మా చదువుల గురించీ వూరందరికీ గొప్పగా చెప్పుకోవటాలూ... అది కూడా మాకు మధురమైన స్మృతినే మిగిల్చింది.

తిరిగి ఆరేళ్ల తర్వాత నిరుటి సంవత్సరం అక్క పెళ్లి కన్నా ఓ నెలముందు పల్లెకు వెళ్లాము. తమ్ముడు యీత నేర్చుకొనేందుకు బావుల్లో నీళ్లు లేవు. మేము వెళ్లేసరికి ఆ ఎర్రటి ఎండాకాలం ఇంట్లో ఎవ్వరూ లేరు. మా పెద్ద చెల్లి కూడా లేదు. తమ్ముడొకడు కన్పించాడు. అందరూ 'ఉపాధి హామీ' కూలి పనులకు వెళ్లారట. చిన్నాన్న కుటుంబం కూలి పనికి వెళ్ళటమేమిటి? మాకు ఆశ్చర్యం కలిగింది. తర్వాత విచారిస్తే తెలిసింది – వూర్లో రైతులంతా ఉపాధి పనికి పోతున్నారని, మధ్యాహ్నం దాకా పన్జేస్తే వందరూపాయల

కూలిట. అందుకే అందరికీ జాబ్ కార్డులు సంపాదించి ఇంటర్ చదివే కూతుర్ని కూడా పనికి తీసుకెళ్తున్నారట చిన్నాన్న. అంతటి ఎండపొద్దున తిరిగి వచ్చి కూడా మమ్మల్ని చూసి ఎంతో ఆనందించారు వాళ్లు. మర్నాడు ఆదివారం కాబట్టి ఇంటి వద్దే వున్నారు కోళ్లని కోశారు. అలసంద వడలు కాల్చారు. మరేవో పిండివంటలు చేశారు. సోమవారం మధ్యాహ్నం దాకా పనికి వెళ్లి వచ్చారు. కాలేజి పిల్లలు సైతం ఎర్రటి ఎండల్లో పనికి వెళ్లటం మాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. అంతటి కరువు సమయంలో, సంక్షోభ పరిస్థితుల్లో కూడా - పెళ్లికూతురు కాబోతున్న అక్కను వూరంతా ఎంత ఆప్యాయంగా పలుకరించారనీ! ఎంత వింతగా చూశారనీ! ఇప్పుడు కూడా పల్లె మమ్మల్ని బాధపెట్టలేదు. తనెంత కరువులో అలమటిస్తోన్నా మమ్మల్ని ఆప్యాయంగా చూసుకొంది ప్రేమతో ఆదరించింది.

మరి... నాన్ననెందుకు అంతగా క్షోభపెడుతోంది?

ఆలోచిస్తూ వుండిపోయాను.

నాన్న యింకా రాలేదు. ఆత్మీయ స్నేహితుడెవరైనా దొరికి వుంటే తన గుండె ఘోషను విన్పిస్తున్నాడు కాబోలు.

తమ్ముడు టివి చూస్తూ హోంవర్క్ చేసుకొంటున్నాడు.

పెందలాడే భోంచేయటం నాన్నకు అలవాటు. ఆ అలవాటు తనకు పల్లెనించి సంక్రమించిందంటాడు. ఇన్నేళ్లుగా టౌన్లో వున్నా చాలావరకుర పల్లె అలవాట్లను వదులుచ్కోలేదు నాన్న. చిన్న చిన్న జ్వరాలకు, తలనొప్పి, వొళ్లు నొప్పులకు టాబ్లెట్స్ మింగడు. చీటికి మాటికీ ఆసుపత్రికి పోడు. ఒకటి రెండు రోజులు మొండిగా తన పనులు తాను చేసుకొంటాడు. తర్వాత మేమంతా ఆందోళన చేస్తే డాక్టర్ సహాయం తీసుకొంటాడు.

ఎప్పుడైనా దారితప్పి ఇంటిముందు కొబ్బరిచెట్టుమీద వాలిన కోయిల తెల్లారుజామున కూసిందంటే చాలు తనను పిల్చినట్లే భావించి మంచం మీంచి ఒక్క గెంతుతో బైటకు పోతాడు. చిన్నపిల్లాడిలా అదే పనిగా దాని గొంతు వింటూ వుంటాడు.

ఐదారేళ్ల కిందటి దాకా రెండు వూరపిచ్చుకలు ఇంట్లోకి వస్తుండేవి. అవి అద్దంలో తమ ప్రతిబింబాల్ని చూసుకొని ముక్కులతో పొడిచి పొడిచి గొడవ జేస్తోంటే - మాకందరికీ ఆ దృశ్యాల్ని చూపించి ఎంత మురిసిపోయేవాడనీ!

వానవచ్చిన రోజు చూడాలి ఆయన సంతోషం. ఇంటిముందు కొబ్బరిచెట్టు వద్ద నిల్చుని రెండు నిమిషాలయినా తడవాల్సిందే. టవల్‌తో తల రుద్దుకోవాల్సిందే. 'జలుబు చేస్తుం'దని అమ్మ ఆరాటపడుతోన్నా పట్టించుకోడు. కాగితప్పడవలు చేసి మాకిస్తూ, చినుకుల మునివేళ్లను స్పృశిస్తూ వాన నీళ్లను ఎలా ఆటవస్తువులుగా మార్చుకోవచ్చో మాకు నేర్పిస్తాడు.

నెలల కాలాలు బిగదీసి ఎప్పుడైనా అర్ధరాత్రి హఠాత్తుగా వాన వంగినపుడు 'పావనీ!' అంటూ అక్కను లేపుతాడు. ఆ పిలుపుతో అక్కకంటే ముందు నాకే మెలకువ వస్తుంది. కళ్లు తెరవక ముందే వానగాలి ముక్కులకు సోకుతుంది. నాన్న పక్కన కూచుని అక్కా నేనూ వాన చినుకుల చిటపటలు వింటూ, వాన తుంపరల స్పర్శను అనుభూతిస్తుంటాము.

ఉన్నట్టుండి నాన్న అంటాడు ''యీవాన మనూరిమీద కురుస్తొందో లేదో?'' అని. ఆయన గొంతులోని తడి మాకు స్పష్టంగా విన్పిస్తుంది.

''నీ తమ్ముని చేలమీద కురుస్తొందిలే. ఎందుకు ఆరాటపడ్తావు గాని. అవిగో ఆ వైపే మేఘాలంతా నల్లగా వుండాయిలే..'' అక్క నవ్వుతూ అంటుంది.

ఉదయం ఫోన్ చేసి కనుక్కొని నిర్ధారించుకొన్న తర్వాత గాని తృప్తి పడడు ఆయన.

బస్టాండులో పరిచయస్తుడైన పల్లెమనిషి కనిపిస్తే చాలు ఆయన మొట్టమొదట వేసే ప్రశ్న ''మనూరి పక్క వాన పడిందాబ్బీ!'' అని. తర్వాత 'ఏ పైరు పెట్టా'రని. ఆ తర్వాతే క్షేమ సమాచారాలు. ఫోన్ పలకరింపులపుడు కూడా మొదట వేసే ప్రశ్న అదే - ''హలో! రామసుబ్బయ్యా! ఏంబ్బీ! వానబడిందా మనపక్క? ఏం పైర్లేసిన్రు?... ఆ.. అమ్మ, నాయన అందరూ బాగుండారు గదూ?'' అంటూ ఇలా...

నాన్నే కాదు - యీ ప్రాంతంలోని రైతులు చాలామంది అలాగే స్పందిస్తుంటారు.

నా ప్రశ్న ఏమిటంటే - వూరునీ, వ్యవసాయాన్నీ వదిలి ఇన్నేళ్ళయింది గదా! ఇంకా ఆ పల్లె భావాల్నించి నాన్న బైటపడలేకపోతున్నాడు ఎందుకని?

తన వాటా పొలం కూడా తమ్మునికే వదలి వచ్చాడు. అప్పుడప్పుడూ వ్యవసాయ పెట్టుబడులకు కూడా అందిస్తుంటాడు. ఆస్తి ఇచ్చాడు కాబట్టి అమ్మానాన్నను సాకే బాధ్యత తనకు లేకున్నా - వాళ్లు పడే కష్టం చూల్లేక ఆయన మధనపడుతోంటే అమ్మ చెప్పింది ''ముసిలోల్లను ఇక్కడికే తీసుకురా! వీల్లు తినే నాలుగు పిడచలు మన కుండలో లేవా?'' అని.

నాన్న ఎంత బతిమాలినా ఇక్కడకు వచ్చేందుకు ఇష్టపడలేదుట అబ్బ, జేజి.

దీనికి కారణం కూడా నాన్నే విశ్లేషించి చెప్పాడు. ఏ తల్లిదండ్రులయినా కష్టపడే కొడుకు దగ్గరే వుండి అతనికి చేతనైన సహాయం చేయాలనుకొంటారు గాని, సుఖపడే కొడుకు వద్ద సోమరిగా కూచుని తినాలనుకోరట. అందులోనూ బతుకంతా కాయకష్టం చేసి బతికినోల్లు. ఇంతకాలం అనుబంధాల్ని పెంచుకొన్న పొలాన్ని సాగుచేసే కొడుకును కాదని, పొలానికి దూరంగా బతికే కొడుకు వద్దకు చచ్చినా వెళ్లరట. పొరబాటున తాము మరెక్కడైనా దూరంగా హాస్పిటల్స్‌లో మరణించినా శవాల్ని తమ వూరి పొలాల వద్దే పూడ్చమని చివరి కోరిక కూడా కోరతారుట.

వాళ్ల సెంటిమెంట్స్ అలా వున్నాయి. పొలాలతోటి, పల్లెతోటి అనుబంధాలు అంత బలంగా వున్నాయి నాన్నక్కూడా పల్లెతోటి సెంటిమెంట్స్ వున్నాయి. తమకే ఏ సెంటిమెంటూ లేకుండా - ఉన్నపళంగా యీ యింటినీ, యీ వూరినీ వదలి వేరే వూరికి పోవాలన్నా ఎలాంటి ఫీలింగ్స్ లేకుండా... ఎందుకని?

కొంత ఆలస్యంగా వచ్చాడు నాన్న.

ఆయనకు ఇష్టమైన చింతచివురు లేత వంకాయలు వేసి ఎనిపిన పప్పు పళ్లెంలో కనిపించినా సగం అన్నం కూడా మింగలేదు. ఏవో ఆలోచనల్లో పడి సరిగ్గా భోంచేయలేదు.

నాన్న వేదన చూసి నాక్కూడా తృప్తిగా తిన బుద్ధి కాలేదు.

ఇవేమీ పట్టించుకోకుండా టీవి చూస్తోంది అమ్మ.



## నాదైన ఫీలింగ్స్

ఇది నా మొదటి కథ. మొన్న వేసవి సెలవుల్లో నాన్న కథలు మరోసారి చదివాను. అందులో 'తమ్ముడి ఉత్తరం' కథ నన్ను బాగా కదలించింది. పల్లెలో వ్యవసాయం చేసుకొనే తమ్ముని గురించీ, అతని వ్యవసాయ పతనాన్ని గురించీ, రైతు దుఃఖాన్ని గురించీ - టౌన్లో ప్రభుత్వోద్యోగిగా జీవిస్తోన్న ఓ అన్న అనుభవించే మానసిక వేదన ఆ కథ. దానిలో నా పాత్రను సృష్టించాడు నాన్న. నా ఫీలింగ్స్ కూడా చెప్పాడు. అందులో నాన్న చెప్పింది వాస్తవమే అయినప్పటికీ నాదైన ఫీలింగ్స్ ఏవో ఇంకా కొన్ని మిగిలున్నాయనిపించింది. అందుకే వేసవి సెలవుల్లో యీ కథ రాసి నాన్నకు చూపించాను. కథలో విషయం బావుంది కాని కథ చెప్పిన విధానం సరిలేదన్నాడు నాన్న. జూన్‌లో అనుకొంటాను - ఆంధ్రజ్యోతి డైలీ నవ్యపేజీలో జగన్నాథ శర్మ గారి ''నాన్నంటే...'' కథ చదివాను. ఆ కథ నన్నెంతో ఆకట్టుకొంది. నాన్నకు చూపించాను 'అది చాలా గొప్ప కథ అనీ, పాతికేళ్ళ కిందట తను కథా సాహిత్యానికి పరిచయమైన తొలి రోజుల్లో దాన్ని ఆంధ్రజ్యోతిలో చదివాననీ, ఆ కథలో చూపించిన నడక నీకేమైనా ఉపయోగపడుతుందేమో చూడమనీ'' చెప్పాడు నాన్న. నిజంగానే నాకా కథ సహాయపడింది.

ఈ కథకు కథల పోటీలో బహుమతి వచ్చిందంటే కారణం నాన్న సూచనలూ, జగన్నాథ శర్మగారి కథ ప్రభావమూ అనక తప్పదు. వాళ్లిద్దరికీ నేను వినమ్రంగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

**సన్నపురెడ్డి శ్రావణి**

***D/o. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి***
***బాలరాజుపల్లె, నరసాపురం పోస్టు,***
***కాశినాయన మండలం, కడప జిల్లా***

తమ్ముడు ఇంకా పుస్తకాలతో కుస్తీ పడుతూనే ఉన్నాడు.

చేతులు తుడుచుకొంటూ బైటకెళ్లి కాంపౌండ్‌వాల్‌ను ఆనుకొని నిల్చున్నాడు నాన్న.

కొబ్బరి మట్టల చాట్నుంచి వెన్నెల జారుతూ వుంది.

''ఏం రెడ్డి! వూరికి పోయొచ్చినట్టుండావే?'' పక్క కాంపౌండ్‌లోంచి ప్రశ్న.

అటుకేసి తిరిగాడు నాన్న.

''ఎట్లుంది పల్లె పరిస్థితి?'' సుబ్బారాయుడు అంకుల్ ప్రశ్నించాడు.

''మామూలే..'' నిర్లిప్తంగా చెప్పాడు నాన్న.

''పత్తి విరుగుతుంటాదే..''

''ఏం విరగడం? పత్తి పైరంతా చస్తావుంది.'' చెప్పాడు నాన్న. ''ఆశ్లేష కార్తె దాటతా వుంది. చుక్క చినుకు లేదు. బోరు బావుల్ని నమ్ముకొని పెట్టిన పైరు - బోర్లెండి పోవటంతో వచ్చే ప్రాణం పోయే ప్రాణంగా వుంది. చేను దగ్గరికి పోయి చావు బతుకుల్లో వున్న పైరుని చూసి ఆరాటపడతా చేనుచుట్టూ గిరగిర తిరిగి ఇంటికొచ్చి కుక్కిమంచంలో కూలబడి దిగులుతో కొట్టుకులాడే రైతును చూస్తాంటే గుండె తరుక్కుపోతాంది రాయుడూ! ఏం బతుకులో వాళ్ల బతుకులు!'' బాధ పడ్డాడు.

''మొదట్లో నేను కూడా అట్లనే బాధపడినా, ఎవురి ఖర్మకు ఎవురం బాధ్యులం. ఆస్తిలో భాగం తీసుకోకపోతివి. అంతో యింతో సాయం కూడా చేస్తాంటివి. ఇంక నువ్వేం చేయగలవు? ఆ పల్లె సంగతులు నెత్తికెత్తుకొంటే మనమేడ బతుకుతాం? వాళ్లను దేవుడు కూడా బాగుపరచ లేడు. అవన్నీ పట్టించుకోకుండా నీ బతుకు నువ్వు బతుకు. సుగంగా బతికేటోడికి నీకెందుకు ఆ గసటలన్నీ'' చెప్పాడు సుబ్బారాయుడు.

''నా సుఖమే నా బాధ'' నాన్న అన్నాడు. ''అవును రాయుడూ! నేను కష్టపడకుండా బతుకుతుండాననేదే నా కష్టం. ఒకే తండ్రికి పుట్టినా నేనిక్కడ సుఖంగా... నా తమ్ముడక్కడ సర్వదుఃఖాలతో ఇంత వ్యత్యాసం ఎందుకు చెప్పు? భూమిని నమ్ముకొన్నందుకే గదా వానికా కష్టాలు...'' నాన్న గొంతు బొంగురుపోయింది.

నేను భరించలేక పోయాను.

నాన్నదుఃఖాన్ని సహించే శక్తి నాకు లేదు.

ఇంట్లోకెళ్లి మంచమ్మీద పడిపోయాను.

నాన్న వేదన ఇప్పుడిప్పుడే చల్లారేది కాదు.

తన పుట్టినింటి బాధల్ని గాని, మెట్టినింటి కష్టాల్ని గాని ఏమాత్రం పట్టించుకోకుండా ఎవరి జీవితం వాళ్లదన్నట్లుగా, ఆ సమస్య తనది కాదన్నట్లుగా నిమ్మలంగా వుంటుంది అమ్మ.

మరి - నాన్నెందుకు అట్లా ఉండలేకపోతున్నాడు?

పల్లెకు వెళ్లినపుడంతా అక్కణ్ణించి నాన్న తను చేసంచితో మోసుకొచ్చేవి కందులు అలసందలు కాదేమో! అక్కడి కష్టాలు కన్నీళ్ళేనేమో! అవే నాన్న గుండెల్లో పల్లెతోటి అనుబంధాల్ని తాజాగా ఉంచుతున్నాయేమో!

నాన్నకు సెంటిమెంట్ ఎక్కువే. నాన్నకే కాదు చిన్నాన్న, అబ్బలకు కూడా. అబ్బకు పొలమూ, పైరూ, వూరూ సెంటిమెంటయితే, నాన్నకు మాత్రం ఆ పొలంతో సంబంధమున్న తనవాళ్లు సెంటిమెంట్.... మరి... మాకు ఏ సెంటిమెంట్లూ లేవా?

పల్లెమీద ఆయనకు మమకారం ఎక్కువే. కాదనను. అది ధర్మం కూడా. కానీ.... పల్లెమీద ఆయనకున్న మమకారం కన్నా ఆయనమీద మాకున్న ప్రేమ ఎక్కువ. అనుక్షణం ఆయన పల్లెను గురించి ఆలోచిస్తూ బాధపడుతోంటే 'నాన్న ఏమైపోతాడో'ననే భయం పట్టుకొంది నాకు.

నాన్నే మాకు సెంటిమెంట్.

మా నాన్న బాధపడితే మేం చూడలేం.

మమ్మల్నందర్నీ వదిలేసి నాన్ననే టార్గెట్ చేసి వెంటాడుతోన్న పల్లె మీద నాకు కోపంగా వుంది

మాకు నాన్న కావాలి.

*

కవిత

# బాధితుడు



అతను స్వేచ్ఛ గురించి మానవహక్కుల గురించి రాస్తాడు
కళ్లెదుట జరుగుతున్న అన్యాయాన్ని కలంతో నిలదీస్తాడు
అతని ఆయుధం కలమే కదా!
సమస్యల సుడిగుండపు సమాజంలోకి దూకి ప్రతి రోజూ
ఒక తాజా సమస్యతో బైటికొస్తాడతను..
ఇన్ని రింగులు తిరగాల్సిన అవసరమేంటని బాధితుల తరపునుండి
రింగురోడ్డు గురించి ప్రశ్నిస్తాడతను..
గుడిసెలు కూలిస్తే పాపం వాళ్ల పరిస్థితేంటని బాధ్యతగా అడుగుతాడతను.
ఇళ్లనుండి పచ్చని పొలాలనుండి భద్రతా భావంనుండి ప్రజల్ని తరిమేసి
వారి జీవితాల్ని కొందరి దగ్గర తాకట్టు పెట్టాల్సిన అవసరమేమొచ్చిందని
ఆక్రోశిస్తాడతను..
వారికి జీతాలెప్పుడు పెంచుతారని అడుగుతాడు..
వారి జీవితాలెప్పుడు బాగుపడతాయంటాడు..
ఇంటిని ముంచేసిన వాన నీళ్ల గురించి అతనే చెబుతాడు..
వరద నీటిలో కొట్టుకుపోయినా అతనే చెబుతాడు..
కూలిన గోడ క్రింద మరణించిన వారి గురించి అతనే చెబుతాడు..
సర్కారీ దవాఖాన మెట్ల మీదే ప్రసవించిన స్త్రీగురించి రాస్తాడు.
కార్పొరేట్ ఆసుపత్రి కోరల్లో చిక్కి కిడ్నీ కోల్పోయిన వారి గురించీ రాస్తాడు.
అప్పటిదాకా మనకు తెలియని
అకస్మాత్తుగా వచ్చిపడిన విపత్తు వివరాలని అందిస్తాడతను..
ఇరువర్గాల వాళ్లు విసురుకుంటున్న రాళ్లనుండి తప్పించుకుంటూ
మనకేదో చెప్పాలని ప్రయత్నిస్తుంటాడతను..
లాఠీ చార్జీ చెయ్యాల్సిన అవసరమేమొచ్చిందన్న వారితో ఉంటాడు..
లాఠీచార్జీ చెయ్యకపోతే కంట్రోలు కాదు అన్నవారితోనూ ఉంటాడు..
ఎవరూ వెళ్లలేని చోట
గాలిలా చొరబడతాడతను..
పొగ వ్యాపించకముందే
నిప్పుగురించి పసికడతాడతను..
అన్నపూర్ణలాంటి దేశంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల విషాద కథలన్నీ
అతని వద్ద ఉన్నాయి..
అంతకంతకూ విస్తరిస్తున్న అవినీతి రికార్డులూ ఉన్నాయి..
కాస్త మద్యం, ఒక బిర్యాని పొట్లానికి ఓటు రూపంలో తమని తాము
అమ్ముకునే వారికి చెవిటివాడిముందు ఊదే శంఖంలా
ప్రజాస్వామ్యం గురించి చెబుతుంటాడతను..
పట్టెడన్నం కోసం శ్రమించేవాడికి
ప్రజాస్వామ్యం గురించి పట్టదనే విషయం పాపం తెలియదతనికి!
సింగరేణి గని కార్మికుడు
రైల్వే కళాసి మల్లేషన్న
రోడ్లు ఊడ్చే బాయమ్మ
అడ్డామీద కూలీ
అరటి పండ్లమ్మే కరీంభాయ్
గల్లీ లీడరూ, మావోయిస్టూ, పోలీసు
అందరూ అతనికి ఆప్తులే..!
ఉద్యోగ భద్రత గురించి భయపడే సగటు ఉద్యోగికి అతీతుడేం కాడతను..
స్వేచ్ఛ గురించి, మానవ హక్కుల గురించి రాయడానికి నియమించబడ్డాడతను..

**- షేక్ రఫీ**